# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ గురువారం | 29 మే 2025 | ■ 12 పేజీలు






# బస్సులు భద్రమేనా..

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

- స్కూల్ బస్సులకు 'ఫిట్‌నెస్' తప్పనిసరి
- వాహనాల కండీషన్‌పై అనుమానాలు
- కాలం చెల్లిన వాటితో ప్రాణసంకటం
- సగం బస్సులకు ఫిట్‌లెస్..
- ఇందులో కాలం చెల్లిన బస్సులకు రంగులు వేసి నడిపిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు
- బస్సుల్లో కనీస సౌకర్యాలు కరవు
- వయస్సు మళ్లిన వారే డ్రైవర్లు
- పది రోజుల పాటు మాత్రమే తనిఖీలు
- ఆ తరువాత షరా మామూలే..
- ప్రైవేట్ యాజమాన్యాలకు అవగాహన
- ఫిట్‌నెస్ చేయించుకునేందుకు ముందురాని పలువురు..
- ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా బస్సులు..
- ఫిట్‌నెస్ లేకున్నా రోడ్లపైకి పలు ప్రైవేట్ పాఠశాలల వాహనాలు..
- బడి బస్సుల్లో మచ్చుకైన కనిపించని ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, ఫైర్ పరికరాలు
- చిన్నపిల్లలు బస్సు ఎక్కాలంటే ఇబ్బందే
- నామమాత్రంగా రక్షణ చర్యలు
- ఆర్టీఏ అధికారుల తనిఖీల్లో వెల్లడి
- 13 నుంచి బడులు ప్రారంభం..

స్కూళ్లు, కాలేజీలకు సంబంధించిన బస్సులు ఎంతమేర భద్రంగా ఉన్నాయనే దానిపై ఫిట్‌నెస్ చేయిస్తేనే క్లారిటీ వస్తుంది.. కానీ మెజార్టీ యాజమాన్యాలు ఫిట్‌నెస్ చేయించకుండా తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.. ఫిట్‌గా లేని బస్సులు రోడ్లపైకి వస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉండటంతో ప్రతి సంవత్సరం జూన్‌లో ఫిట్‌నెస్ చేయించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా బస్సులు ఫిట్‌గా ఉంటేనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు.. కానీ చాలా ప్రాంతాల్లో యాజమాన్యాలు వెనకడుగు వేస్తున్నారు.. మరో పది రోజుల్లో స్కూళ్లు రీ ఓపెన్ అవుతున్నాయి..

ఆ లోగా పూర్తి స్థాయిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న స్కూళ్లు, కాలేజీల బస్సులు ఫిట్‌నెస్ చేయించు కోవడం సాధ్య మయ్యేలా కనిపించడం లేదు.. అయితే విద్యా సంస్థలు ప్రారంభమయ్యే సమయానికి స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకోవాల్సి ఉంది. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా స్కూల్ బస్సులను నడిపితే సీజ్ చేయడంతో పాటు భారీగా జరిమానా విధిస్తారు.

ఈ విషయంపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారులు ఇప్పటికే ఆయా పాఠశాలల యాజమాన్యాలకు అవగాహన కల్పించారు. మరో 12 రోజుల్లో విద్యా సంస్థలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అంతకు ముందే బస్సులకు మరమ్మతులు పూర్తి చేసుకొని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని సూచిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి స్కూల్ బస్సులను నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

వివరాలు 5లో




## సిర్పూర్ నియోజకవర్గంలో

# వేడెక్కిన రాజకీయం

### నువ్వా, నేనా అంటూ సవాళ్ల పర్వం



- ప్రాజెక్టు కట్టి నీళ్లు ఇవ్వగలవా? ఎమ్మెల్యే హరీష్ బాబుకు.. సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఘాటు సవాల్
- మాజీ ఎమ్మెల్యే కోనప్ప, పాల్వాయి హౌస్ అరెస్ట్..
- కోనప్ప, పాల్వాయి అనుచరులు భారీగా తరలిరావడంతో ఉద్రిక్తత వాతావరణం
- కౌటాలలో భారీగా పోలీసుల మోహరింపు..!

సిర్పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మధ్య సాగుతున్న సవాళ్ల నేపథ్యంలో బుధవారం నియోజకవర్గంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రాణహిత ప్రాజెక్టు కౌటాల మండలం తుమ్మిడిహట్టి వద్ద నిర్మించకపోవడానికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నిర్లక్ష్యమే కారణమని ఎమ్మెల్యే ఆరోపించారు. మరోవైపు తన హయాంలోనే ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయించామని, మాజీ ఎమ్మెల్యే రాజ్యలక్ష్మి ఆనాడు ప్రాజెక్టును అడ్డుకున్నారని కోనప్ప ఆరోపించారు. తుమ్మిడిహట్టి వద్ద బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో జిల్లా అదనపు ఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, కోనప్ప ఇళ్ల వద్ద పోలీసులను మోహరించి ఇరువురిని గృహ నిర్బంధంలో ఉంచారు.

మిగతా 7 లో...



## బాసర ట్రిపుల్ ఐటీ

# నోటిఫికేషన్ విడుదల

బాసర ఆర్జీయూకేటీలో ప్రవేశాల కోసం 2025-26 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్‌ను బుధవారం వైస్ చాన్సలర్ గోవర్ధన్ విడుదల చేశారు.



2

## ధాన్యం సేకరణ

# వేగవంతం చేయాలి

- ధాన్యం కొనుగోలులో అలసత్వం వహిస్తే చర్యలు
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్..
- సారంగాపూర్‌లో కొనుగోలు కేంద్రం తనిఖీ..



11

## ఆపరేషన్ కగార్ పేరుతో

# బూటకపు ఎన్‌కౌంటర్లు

- బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం దుర్మార్గమైన చర్య
- ప్రభుత్వ మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
- ఆపరేషన్ కగార్ నిరసన సభలో అరుణోదయ కళాకారిణి, ప్రజాఉద్యమాల పోరాటసమితి అధ్యక్షురాలు విమలక్క

## కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ

# వేగవంతం చేయాలి

### సారంగాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన నిర్మల్ కలెక్టర్ అభిలాష అభిన్



**సారంగాపూర్, మే 28 (ప్రభాత సమాచారం)**
రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సారంగాపూర్, జామ్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పి.ఎస్.సి.ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ధాన్యం తూకం, లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మిగిలి ఉన్న వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న హమాలీలతో పాటు ప్రతి కేంద్రంలో మరో 20 మంది అదనపు కూలీలను సమకూర్చి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కూడా చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. వరి ధాన్యం కొనుగోలుపై ఎటువంటి అపోహలకు లోనుకావద్దని, రైతులందరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. అనంతరం జామ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ధాన్యపు తేమ శాతం, తూకం ప్రక్రియలను పరిశీలించారు. మిల్లర్లు ధాన్యంలో కోత విధిస్తున్నారని రైతుల నుంచి ఫిర్యాదు రావడంతో, కలెక్టర్ మిల్లర్‌తో మాట్లాడి అటువంటి చర్యలు తగవని స్పష్టం చేశారు. ధాన్యంలో ఎటువంటి కోతలూ లేకుండా, తూకం వేసి, తక్షణమే మిల్లులకు తరలించాలని కలెక్టర్ అధికారుల ను ఆదేశించారు. తనిఖీల్లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్, జిల్లా మేనేజర్ సుధాకర్, తహసిల్దార్ శ్రీదేవి, అధికారులు పాల్గొన్నారు.





## ఎన్టీఆర్ సేవలు మరువలేనివి

**నిర్మల్, మే 28 (ప్రభాత సమాచారం)**
స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకలను తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ స్టేషన్ చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రమేష్ భీమ్ రెడ్డి మౌలానా సురేష్ రాజేశ్వర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్ ఎఫ్ ఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి సీనియర్ నాయకులు భూషణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

### జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన

## విద్యార్థికి ఆర్థిక సాయం

**నిర్మల్, మే 28 (ప్రభాత సమాచారం)**
జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సోమభీమ్ రెడ్డి బుధవారం అందజేశారు. జూన్4 నుంచి 7 వరకు గోవాలో జరగనున్న జాతీయ స్థాయి జూనియర్ అండర్-17 బాలికల బాక్సింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్న నేపథ్యంలో రూ.10 వేల ఆర్థిక సహాయం చేశారు. జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## మానవ అక్రమ రవాణాపై అవగాహన




**నిర్మల్, మే 28 (ప్రభాత సమాచారం)**
ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉపాధ్యాయులకు మానవ అక్రమ రవాణా చిన్న పిల్లల భద్రత అంశంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్‌గా రమాదేవి, ముఖ్య అతిథులుగా పరమేశ్వర్ ఏసీజి, నరసయ్య ఎస్ఓ, స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డానియల్, రిసోర్స్ పర్సన్లుగా సిరాజ్, అనిల్ వ్యవహరించారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించారు. కేజీబీవీ వసతి గృహాల్లో గురుకులాల్లో చదువుకుంటున్న విద్యార్థినులకు అవగాహన కల్పించడం కోసం కేజీబీవీ మహిళా ఉపాధ్యాయులను ఈ శిక్షణ కార్యక్రమానికి ఆహ్వానించడం జరిగిందన్నారు. రెండు రోజుల శిక్షణ కార్యక్రమం అనంతరం వారు విద్యార్థుల్లో చైతన్యాన్ని నింపి తద్వారా సమాజంలో మార్పు తీసుకురావడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని కోర్సు డైరెక్టర్ రమాదేవి అన్నారు.



## రసాయన ఎరువుల

# వాడకాన్ని తగ్గించాలి

**బోథ్, మే 28 (ప్రభాత సమాచారం)**
రసాయన ఎరువులను తక్కువ మోతాదులో వాడి ఖర్చులను తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాంప్రసాద్ సూచించారు. బుధవారం తాంసి మండలంలోని పాలూడి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పంట మార్పిడి పద్ధతి పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందాలని అన్నారు. రసాయన ఎరువుల వాడకంతో భూసారం దెబ్బతింటుందన్నారు. రైతులు సేంద్రియ ఎరువులను వాడితే అధిక లాభాలు అర్జించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త ప్రవీణ్ కుమార్, మండల ఏవో రవీందర్, ఏఈఓ శివ ప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదాలు

### మాజీ మంత్రి జోగు రామన్న



**ఆదిలాబాద్, మే 28 (ప్రభాత సమాచారం)**
జాతీయ రహదారి 363 పై ప్రమాదాలు జరగడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కారణమని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలోని నేషనల్ హైవే 363 రెండేళ్ల పూర్తి కావాల్సి ఉన్న పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని తెలిపారు. జైనథ్ మండలం తర్నం వద్ద ఇటీవల రూ.4.5కోట్లతో నిర్మించిన వం తెన ప్రమాదాలకు కారణం అవుతుందని తెలిపారు. మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి జైనత్ మండలం లక్ష్మీపూర్‌కు చెందిన దత్తు అనే యువకుడు మోటర్ సైకిల్‌పై వంతెన దాటుతుండగా గల్లంతయినట్టు తెలిపారు. పాత వంతెన ద్విచక్ర వాహనదారులు ప్రయాణించడానికి అనుకూలంగా ఉండగా ఇటీవల నేషనల్ హైవే అధికారులు వంతె నను కూల్చివేసినట్లు తెలిపారు. రహదారి నిర్మాణం పనులు పర్యవేక్షణలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు.

### జూన్ 3 నుండి టెన్త్ అడ్వాన్స్డ్

## సప్లమెంటరీ పరీక్షలు

### జిల్లా విద్యాధికారి యాదయ్య

**మంచిర్యాల, మే 28 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో జూన్ 3వ తేదీ నుండి పదవ తరగతి అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3,4,5,6,11,12,13 తేదీలలో ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 3వ తేదీన ఫస్ట్ లాంగ్వేజ్ పార్ట్-1, 2 పరీక్ష ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం, 12.50 వరకు, 9,10 తేదీలలో ఉదయం 9.30 నుండి 11 వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష నిర్వహణ కొరకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా త్రాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, వైద్య సిబ్బంది నియామకం, పరీక్ష సమయానికి అనుగుణంగా బస్సులు నడపడం, ఇతర అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.

## భారీ వర్షాల నేపథ్యంలో.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ఆదిలాబాద్, మే 28 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. భారీ వర్షాల కురుస్తున్న నేపథ్యంలో ఏ విధమైన ఆస్తి నష్టం కలగకుండా అధికారులు హెడ్ క్వార్టర్ లోనే ఉండి పర్యవేక్షించాలని తెలిపారు. వర్షాల కారణంగా ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాల వలన వరదలు, వంకలు ఉప్పొంగిపోతే రోడ్లు, వంతెనలు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నాలాలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి డ్రైనేజీ నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థకు చేరిన పాత ఇళ్లు వర్షాలకు నాని కూలిపోయే అవకాశం ఉన్నందున అక్కడ నివసించే వారిని ఖాళీ చేయించాలని, ఐరన్ విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లు ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల జరిగే ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, రోడ్లపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలను పూడ్చాలని ఆదేశించారు. మున్సిపల్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో ఆపదమిత్ర శిక్షణ పొందిన వలంటీర్లను వినియోగించుకోవాలని, సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉండడంతో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, అత్యవసర పరిస్థితుల్లో 18004251939 కంట్రోల్ నెంబర్‌కు కాల్ చేయాలని ప్రజలను జిల్లా కలెక్టర్ కోరారు.




# రాజీవ్ యువ వికాసం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి

**కలెక్టర్ల వీడియోకాన్ఫరెన్సులో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్**

**మంచిర్యాల, మే 28 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం జరుగుతుందని, అర్హులైన లబ్దిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, షెడ్యూల్ కులాల సంక్షేమశాఖ కార్యదర్శి శ్రీధర్, ఇతర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన లబ్దిదారుల ఎంపిక ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా 50 వేల రూపాయల నుండి 1 లక్ష రూపాయల యూనిట్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేసి జూన్ 2వ తేదీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో మొదటి విడత మంజూరు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, అల్పసంఖ్యాక వర్గాలు, ఇతర వెనుకబడిన తరగతుల వర్గాలలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులకు అవకాశం కల్పించడం ద్వారా వారి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనిట్లు కలిపి 4 లక్షల 93 వేల 234 మంది లబ్ధిదారులకు 6 వేల 250 కోట్ల రూపాయల సహాయాన్ని అందించడం జరుగుతుందని, జూన్ 2వ తేదీన దాదాపు 85 వేల మంది లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జూన్ 2వ తేదీ సాయంత్రం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున అన్ని నియోజకవర్గ కేంద్రాలలో 50 వేల రూపాయల నుండి 1 లక్ష రూపాయల వరకు గల యూనిట్ల లబ్ధిదారులకు ఆయా నియోజకవర్గాల శాసన సభ్యుల ద్వారా మంజూరు పత్రాలు అందించాలని తెలిపారు. రాష్ట్రంలోని అర్హత గల నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని చేపట్టిందని, ఈ క్రమంలో అర్హులకు యూనిట్లు కేటాయించి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహించి రాష్ట్ర జి.డి.పి.ని పెంపొందించాలని తెలిపారు. యూనిట్లు పొందిన లబ్దిదారులకు తగు శిక్షణ అందించడం జరుగుతుందని, పథకం అమలులో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారి జాబితాను జిల్లా ఇన్చార్జ్ మంత్రి అందించాలని, జూన్



2వ తేదీన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజు సాయంత్రం 4 గంటలకు నియోజకవర్గ కేంద్రంలో శాసనసభ్యులతో యూనిట్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి జనార్ధన్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. పురుషోత్తం సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రైతులు వందులను నమ్మొద్దు

**■ ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేస్తాం**

**■ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్, మే 28 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ అతి త్వరలో పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. ఇప్పటికే జిల్లాలో 32 వేల 86 మంది రైతుల నుంచి 1 లక్ష 33 వేల 626 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 349 మెట్రిక్ టన్నులు అదనమని అన్నారు. జిల్లాలో రైతుల నుంచి ప్రతిరోజు దాదాపుగా 7 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు తెలిపారు. వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం 1.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనా వేసినప్పటికీ, ఇప్పటివరకు 1.68 లక్షల మెట్రిక్ టన్నులు నమోదు కావడం గర్వకారణమని తెలిపారు. ఇది 15.86 శాతం పెరుగుదలగా నమోదు అయిందన్నారు. గతంతో పోల్చితే రైతుల సంఖ్యలో కూడా భారీగా వృద్ధి జరిగిందని చెప్పారు. 2024లో 29 వేల 979మంది రైతులు ధాన్యాన్ని అమ్మగా, ఈ ఏడాది 32 వేల 86 మంది రైతులు ధాన్యం విక్రయించడంతో 7.02% వృద్ధి నమోదయిందన్నారు. రైతులకు వరి ధాన్యం కొనుగోలు లో ఇబ్బందులు తలెత్తితే ఫిర్యాదులు చేయడానికి 918 2958858 నంబర్ ను ఏర్పాటు చేశామన్నారు. అకాల వర్షాల కారణంగా తడిసిన వరి ధాన్యాన్ని మొత్తాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు అదనంగా కూలీలను, ధాన్యాన్ని తరలించేందుకు లారీలను సమకూరుస్తామన్నారు. అధికారులంతా నిరంతరం కొనుగోలు కేంద్రాలలో ఉండి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. రైతులెవరు వరి ధాన్యం కొనుగోలుపై ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు.

# వంతెన పనులను త్వరగా పూర్తి చేయాలి





**■ కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలి**

**■ ఎర్రవాగు వంతెన నిర్మాణ పనులను పరిశీలించిన మంచిర్యాల జిల్లాకలెక్టర్ కుమార్ దీపక్**

**నెన్నెల, మే 28 (ప్రభాత సమాచారం)**

నెన్నెల మండలంలో ఎర్రవాగుపై నిర్మిస్తున్న వంతెన పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నెన్నెల మండలంలో కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు, ఇందిరమ్మ ఇండ్లు, వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహసీల్దార్ మహేంద్రనాథ్‌తో కలిసి సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం రాబోతుందని, ఈ నేపథ్యంలో మండలంలోని ఎర్రవాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. మండలంలోని జంగల్ పేటలోని కొత్తగూడెం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. నిరుపేదల కొరకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్దిదారులకు మాత్రమే పథకం ఫలాలు అందే విధంగా జాబితా రూపకల్పనలో పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ ప్రాంతంలో అటవీ శాఖ అభ్యంతరం చెబుతున్న భూములను పరిశీలించి వాటికి సంబంధించిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం జోగాపూర్, ఆవుడం గ్రామాలలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల కోసం తాగునీరు, నీడ, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన గోనెసంచులు, టార్పాలిన్లను సమకూర్చడం జరిగిందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు వారికి కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా సమన్వయంతో పని చేయాలని, కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి దేవేందర్ రెడ్డి, ఎస్ఐ, మండల పంచాయతీ అధికారి, ఏపిఓ, ఏపిఎం, ఆర్ఐ, కార్యదర్శులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్లాట్ బుకింగ్ ద్వారా ఆస్తుల రిజిస్ట్రేషన్లు

**ఆసిఫాబాద్, మే 28 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జూన్ 2 నుంచి స్లాట్ బుకింగ్ సేవలు అందుబాటులోకి రానున్నట్లు సబ్ రిజిస్టర్ అప్పారావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్రతిరోజు 48 స్లాట్ బుకింగ్ లకు అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు 24 స్లాట్లు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు 24 స్లాట్ లో ఉంటాయని వెల్లడించారు. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి త్వరలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి వేలిముద్రతో పాటు ఈ సిగ్నేచర్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో అక్రమాలకు తావు లేకుండా ఉంటుందన్నారు. స్లాట్ బుకింగ్ లేనివారికి సాయంత్రం ఐదు నుంచి



ఆరు గంటల మధ్యలో రోజుకి ఐదు రిజిస్ట్రేషన్లను మాత్రమే చేయడం జరుగుతుందన్నారు. స్లాట్ బుకింగ్ చేసుకునేవారు registration.telangana.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు.

# ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

**జన్నారం, మే 28 (ప్రభాత సమాచారం)**

పోడు పట్టాలున్న రైతులు పంట మార్పిడిలో భాగంగా ఆయిల్ ఫామ్, బాంబూ సాగుకు ముందుకు రావాలని మండల వ్యవసాయ అధికారి సంగీత, కవ్వాల్ ఏఈఓ అక్రం సూచించారు. బుధవారం కొత్తపేట గ్రామంలో రైతులతో పంట మార్పిడిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో రైతులు రాథోడ్ జైవంత్, పవార్ దినేష్, చవాన్ రమేష్, పాండు పాల్గొన్నారు.





## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే
# రాజీవ్ యువ వికాసం పథకం లక్ష్యం

**కలెక్టర్ల వీడియోకాన్ఫరెన్సులో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్**

**నిర్మల్, మే 28 (ప్రభాత సమాచారం)**

రాజీవ్ యువ వికాసం పథకం ద్వార నిరుద్యోగ యువతకు పుష్కలమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం సాయంత్రం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ శ్రీధర్ లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, జూన్ 2 వ తేదీ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తామని అన్నారు. ఈ పథకం అమలు ద్వారా రాష్ట్రంలోని నిరుద్యోగులందరూ స్వశక్తితో ఎదుగుతారని తెలిపారు. ఈ పథకం ద్వారా బడుగు బలహీన వర్గాల వారికి ఎంతగానో లాభం చేకూరుతుందని అన్నారు. సుదీర్ఘ కసరత్తు తర్వాత ఈ పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. మొక్కుబడిగా పథకాన్ని అమలు చేయడమే కాకుండా, రానున్న



రోజుల్లో లబ్ధిదారుల ఎదుగుదలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని అన్నారు. దాదాపు 5 లక్షల మంది యువతకు లబ్ధి చేకూరేలా 8 వేల కోట్ల రూపాయలను ఈ పథకానికి వెచ్చించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ పథకం ద్వారా లబ్ధి పొంది వ్యాపారాలు చేస్తున్న వారికి ఇబ్బందులు కలిగితే అధికారులు చొరవ తీసుకొని వారి ఇబ్బందులను తొలగించాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసేందుకు తగు చర్యలు చేపట్టాలని అన్నారు. లబ్ధిదారుల గుర్తింపుకు సంబంధించిన వివరాలను ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, జెడ్పి సీఈవో గోవింద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, మైనార్టీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, ఎల్డిఎం రామ్ గోపాల్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## కొర్రమీను సాగుకు
# దరఖాస్తుల ఆహ్వానం

**మంచిర్యాల జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్**

**మంచిర్యాల, మే 28 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని మత్స్య పరిశ్రమలో పని చేస్తున్న అర్హులైన వారి నుండి కొర్రమీను సాగు చేసేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఔత్సాహికులు, మత్స్యకారులు, మత్స్యకారులు, హోల్ సేల్, రిటైల్ చేపల విక్రయదారులు, చేప పిల్లలు ఉత్పత్తి చేయువారిలో ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాను మురైల్ క్లస్టర్‌గా ఏర్పాటు చేసేందుకు గుర్తించడం జరిగిందని, ఇప్పటికే జిల్లాలో కొర్రమీను సాగు చేస్తున్న, చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకంలో భాగంగా సాధారణ 40 శాతం, ఎస్సీ, ఎస్టీ, మహిళ క్యాటగిరి 60 శాతం రాయితీపై 3 హెచరి యూనిట్లు, 10 హెక్టార్లు చేపల పెంపకం చెరువులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇతర సమాచారం కొరకు సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్-8లోని జిల్లా మత్స్య శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

# అభివృద్ధి పనులను పరిశీలించాలి

**ఇచ్చోడ, మే 28 (ప్రభాత సమాచారం)**

క్షేత్రస్థాయి సిబ్బంది మండలంలో జరుగుతున్నపనులపై దృష్టి సారించాలని ఎంపీడీవో లక్ష్మణ్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్నటువంటి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, నర్సరీ, ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, వర్షాకాలంలో ఆయా గ్రామ పంచాయతీల పరిధిలోని పనుల పైన ప్రతి ఒక్కరు దృష్టిసారించి సమస్యలను వెంటవెంటనే పరిష్కరించాలని తెలిపారు. వర్షకాలం ప్రారంభమై నందున ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, సంబంధిత అధికారులు, సిబ్బంది




విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీ ఓ నరేందర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శులతో పాటు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టు పగలు విద్యుత్ వెలుగులు.. రాత్రి అంధకారం



**జైనూర్, మే 28 (ప్రభాత సమాచారం)**

జైనూర్ మండల కేంద్రంలో జంగావ్ గ్రామాల్లో దసరా, దీపావళి సందర్భంగా స్థంబాలకు అమర్చిన విద్యుత్ బల్బులు ఎనిమిది నెలల నుంచి ఆయా వాడాలో ముఖ్యంగా జంగావ్ గ్రామ పంచాయతీలో ముస్లిం గూడ, సడక్‌గూడ, రాంజీ గూడ, కిషన్‌నాయక్ తండా, కొలంగూడ, భీంజీ గూడ, గొంది పటర్ కుక్కగూడ వాడాలో స్థంబాలకు కరెంట్ బల్బులు వెలుగక చీకటి మయంగా ఉంది. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. కొన్ని వాడలలో వీధి దీపాలు ఉదయం నుంచి వెలుగుతూనే ఉన్నాయి.. మరి కొన్ని వాడలలో రాత్రి పూటకూడా విద్యుత్ దీపాలు వెలగడకపోవడం, మరికొన్ని వాడల్లో స్థంబాలకు బల్బులు వస్తుపోతు ఉంటున్నాయి. బల్బులు పెట్టినామా పెట్టినాం అంతే గాని విద్యుత్ వెలుతురు మాత్రం లేదు. ప్రత్యేక అధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు.



## రైతుల ఖాతాలలో
# రూ. 249 కోట్లు జమ

**అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్**

**మంచిర్యాల, మే 28 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 320 కేంద్రాలు ద్వారా 23 వేల 715 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 68 వేల 519 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 249 కోట్ల 60 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 176 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి కనీస మద్దతు ధర పొందాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 358 లారీల ద్వారా 6 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కరీంనగర్ లోని 68 మిల్లులకు, పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 20 మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 5 కోట్ల రూపాయల నుండి 8 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు ఆటోమెటిక్ యంత్రంతో శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల వద్దకు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకు రావాలని, అకాల వర్షాల సమయంలో కేంద్రాలలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించుకోవాలన్నారు. ధాన్యం కొలతలు పరీక్షించి గ్రేడ్ ఎ, సాధారణ రకాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొనుగోలు కేంద్రాలలో తాగునీరు, ఓ.ఆర్.ఎస్, గోనె సం చులు, టార్పాలిన్లు సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు.

# తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి : మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య



**నెన్నెల, మే 28 (ప్రభాత సమాచారం)**

వర్షాలతో తడిసిన ధాన్యానిన్న ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య డిమాండ్ చేశారు. బుధవారం నెన్నెల మండలంలోని గొల్లపల్లి, మైలారం గ్రామాలలో వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతతూ నెల రోజులుగా రైతులు పంట కోసి వడ్లను కల్లాల్లోనే ఉంచారన్నారు. ఇప్పటి వరకు ఎవరు కొనేవాళ్లు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోళ్లు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. గత పది రోజుల వ్యవధిలో నాలుగు సార్లు వర్షం కురిసిందని, దీంతో కల్లాలో ఉన్న ధాన్యం పూర్తిగా తడిసి పోయి మొలకెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్ మిల్లర్లు రైతులను ముంచుతున్నారని, తరుగు తీసుకుంటున్న పట్టించుకునే వారే లేరన్నారు. ఎమ్మెల్యే వినోద్ రైతులను చుసిన పాపం పోలేదన్నారు. మంత్రి పదవి కోసం మాత్రం లెక్కలేనన్ని సార్లు ఢిల్లీకి పోయాడు తప్పా రైతు వద్దకు రాలేదు అన్నారు. రైతు పండించిన ప్రతి గింజను కొనాలని లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# బడి బస్సులు భద్రమేనా..?



- స్కూల్ బస్సులకు 'ఫిట్‌నెస్' తప్పనిసరి
- వాహనాల కండీషన్‌పై అనుమానాలు
- కాలం చెల్లిన వాటితో ప్రాణసంకటం
- సగం బస్సులకు ఫిట్‌లెస్..
- ఇందులో కాలం చెల్లిన బస్సులకు రంగులు వేసి నడిపిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు
- సగం బస్సుల్లో కనీస సౌకర్యాలు కరవు
- వయస్సు మళ్లిన వారే డ్రైవర్లు
- వారం పది రోజుల పాటు మాత్రమే తనిఖీలు
- ఆ తరువాత షరా మామూలే..
- వివిధ విద్యాసంస్థలకు చెందిన 326 బస్సులు
- ప్రైవేట్ యాజమాన్యాలకు అవగాహన
- నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బస్సులు
- ఫిట్‌నెస్ లేకున్నా రోడ్లపైకి వాహనాలు
- నామమాత్రంగా రక్షణ చర్యలు
- ఆర్టీఏ అధికారుల తనిఖీల్లో వెల్లడి

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)
విద్యా సంస్థలు ప్రారంభమయ్యే సమయానికి స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకోవాల్సి ఉంది. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా స్కూల్ బస్సులను నడిపితే సీజ్ చేయడంతో పాటు భారీగా జరిమానా విధిస్తారు. ఈ విషయంపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారులు ఇప్పటికే ఆయా పాఠశాలల యాజమాన్యాలకు అవగాహన కల్పించారు. మరో 12 రోజుల్లో విద్యా సంస్థలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అంతకు ముందే బస్సులకు మరమ్మతులు పూర్తి చేసుకొని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని సూచిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి స్కూల్ బస్సులను నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. విద్యా సంస్థల ఫిట్నెస్ పరీక్షలు జిల్లాలో నత్తనడకన సాగుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభానికి గడువు సమీపిస్తున్నా విద్యా సంస్థల యాజమాన్యాలు, రవాణా శాఖ ఫిట్నెస్పై శ్రద్ధ చూపడం లేదు. జూన్ 12 నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఇంకా 15 రోజులే గడువు ఉంది. అయినా ఫిట్నెస్ పరీక్షలపై యాజమాన్యాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి.
బడి బస్సుల భద్రమెంతా అనే ఆందోళన వ్యక్తమవుతుంది. స్కూల్ పిల్లలను తీసు కెళ్లాల్సిన సంబంధిత వాహనాల కండీషన్ దారుణంగా ఉంది. ఎప్పటికప్పుడు ఫిట్నెస్ సర్టిఫికెట్ తీసుకోవాల్సిన పాఠశాల యాజమాన్యాలు ఆ దిశగా దృష్టి సారించడం లేదు. కాలంచెల్లిన వాటిని రోడ్లపై తిప్పుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. గతంలో జిల్లాలో పలు సంఘటనలు చోటు చేసుకున్నాయి. జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం ప్రస్తుతం పాఠశాలలకు సెలవులు ఉండడంతో స్కూల్ బస్సులు మూలనపడ్డాయి. చాలావరకు మరమ్మతులో ఉన్నాయి. చిరిగిన సీట్లు, పగిలిన అద్దాలు, అరిగిన టైర్లు, ఫిట్నెస్ లేకపోవడం, కాలం చెల్లినవే దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బడి బస్సులను ముందస్తుగా సిద్ధం చేసుకోవాల్సిన ప్రైవేట్ యాజమాన్యాలు ఆ దిశగా చర్యలు చేప ట్టడం లేదని తెలుస్తోంది. ఫిట్నెస్ లేకుండా బస్సులు తిప్పితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. రవాణాశాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**నిబంధనలు బేఖాతరు..**

పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోగా ఆయా బస్సులను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాల్సి ఉంటుంది. సీట్లు, అద్దాలు, టైర్లు, తదితర అన్నీ సక్రమంగా ఉన్నాయా.. లేదా.? అనేది చూసుకోవాలని రవా ణాశాఖ అధికారులు సూచిస్తున్నారు. స్కూల్ బస్సులకు సంబంధించి 32 అంశాలతో కూడిన నిబంధ నలు పాటించాల్సి ఉంటుంది. డ్రైవర్ వయసు 60 ఏళ్లు మించొద్దు. ఫిట్నెస్, ఇన్సూరెన్స్ తప్పనిసరి. అలాగే వాహనంలో విద్యార్థుల వివరాలు పట్టిక నమోదు చేసి ఉంచాలి. బస్సును 15 ఏళ్లు మించి నడపరాదు వంటి తదితర నిబంధనలున్నాయి. అయితే జిల్లాలో మాత్రం చాలా పాఠశాలలు వీటిని పట్టించుకోవడం లేదు. కండీషన్ లేని బస్సుల్లో విద్యార్థులను తరలిస్తున్నారు. గతంలో ప్రమా దాలు సైతం చోటు చేసుకున్న ఘటనలున్నాయి. ప్రమాదాలు జరగకముందే అప్రమత్తంగా ఉండా ల్సిన ఆ శాఖ అధికారులు నామమాత్రంగా వ్యవహ రిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పాఠశాలల పున ఃప్రారంభం తర్వాత వారం పాటు తూతూమంత్రం గా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలున్నాయి.

**ముగియనున్న ఫిట్నెస్ గడువు..**

జిల్లాలో 167 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ఇందులో 45వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో సగానికిపైగా స్కూల్ బస్సుల్లోనే ఇంటికి రాకపోకలకు సాగిస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా 123 ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలకు సంబం ధించి 140 బస్సులు ఉన్నాయి. వీటికి మే 15 వరకు ఫిట్నెస్ గడువు ముగిసింది. దాదాపు అన్ని బస్సులకు కూడా ఇన్సూరెన్స్ ముగిసింది.

**ఫిట్నెస్ లేని బస్సులను సీజ్ చేస్తాం..**

స్కూల్ యాజమాన్యాలు బస్సుల ఫిట్నెస్ తప్ప నిసరిగా చేయించాలి. పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే ఈ ప్రక్రియ పూర్తి చేయాలి. ఫిట్నెస్ లేని బస్సులు రోడ్డు పైకి వస్తే సీజ్ చేస్తాం. నిబంధనలకు సంబంధిం చి డ్రైవర్లు, యాజమాన్యాలకు అవగాహన కల్పించాం. భద్రత విషయంలో ప్రత్యేక చర్యలు చేపడతాం. స్కూల్ బస్సులను ఇతర కార్యక్రమాలకు వినియోగించరాదు.

**సీపెల్లి శ్రీనివాస్, ఆదిలాబాద్ జిల్లా రవాణాశాఖ అధికారి రవాణా శాఖ సిద్ధం..**

బస్సుల ఫిట్నెస్ పరీక్షలకు జిల్లా రవాణా శాఖ సిద్ధంగా ఉంది. కానీ ఇప్పుడే తొందర ఎందుకన్న ధోరణిలో విద్యా సంస్థల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. జిల్లాలో 380 బడి బస్సులుండగా, ఇప్పటివరకు కేవలం 54 బస్సులకు మాత్రమే ఫిటెనెస్ పరీక్షలు పూర్తయ్యాయి. ఇంకా 326 బస్సులకు పరీక్ష నిర్వహించాల్సి ఉంది. గడువు జూన్ 12 వరకు మాత్రమే ఉంది. ఆ తర్వాత ఫిట్నెస్ లేకుండా రోడ్లపై వస్తే బస్సులు సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రతీ బస్సులో ప్రథమ చికిత్స బాక్సు ఉండాలి. సైడ్ మిర్రర్లు, లైట్లు, బస్సు వెనక ఎరుపు రంగు రేడియం స్టిక్కర్, ముందు తెలుపు రంగు రేడియం స్టిక్కర్ ఉండాలి.

**ఫిట్నెస్ లేకుంటే సీజ్..**

జూన్ 12 వరకు గడువుఉన్నా బస్సుల ఫిట్‌నెస్ పూర్తి చేసుకోవాలని విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచి స్తున్నాం. ఫిట్నెస్ కోసం బస్సులు సమయానికి వస్తే వెంట నే చేసి పంపిస్తాం. బస్సులు ఫిటెనెస్ పరీక్షలు చేయించి సర్టిఫికెట్ పొందాలి. బస్సులను పక్కా గా పరిశీలించాకే ఫిట్నెన్ సర్టిఫికెట్ ఇస్తాం. ఫిట్నెస్ లేకుండా రోడ్డెక్కితే సీజ్ చేస్తాంమని మంచిర్యాల ఎంవీఐ రంజిత్ తెలిపారు.

**నిబంధనలు బేఖాతరు...**

జిల్లాలో చాలా పాఠశాలల బస్సులు సరైన కండిషన్‌లో లేనట్లు తెలుస్తోంది. అయినా రవాణా శాఖ అధికారుల నిబంధనలను బేఖాతరు చేస్తూ గత ఏడాది కొన్ని పాఠశాలల యాజమాన్యాలు బస్సులను నడిపించారు. వాటిల్లో కాలం చెల్లిన బస్సులు ఉన్నా పట్టించుకోవడం లేదు. గత ఏడాది స్కూలు బస్సులు ప్రమాదానికి గురైన సంఘటనలు కూడా ఉన్నాయి. అయితే పాఠశాలలు పునఃప్రారంభం అయిన తర్వాత హడావిడిగా బస్సులను తనిఖీ చేసి సర్టిఫికెట్లు ఇచ్చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా రవాణా శాఖ అధికారులు స్పందించి జిల్లాలోని అన్ని స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తనిఖీలు చేయించి, అనుమతులు తీసుకొనేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ఈ నిబంధనలు తప్పనిసరి...**

స్కూల్ బస్సులకు నిబంధనల మేరకు పూర్తి స్థాయిలో తనిఖీలు చేయించాల్సి ఉంది. బస్సులకు పవర్ స్టీరింగ్, డాష్ ప్యానెల్ బోర్డులో ఎడమ, కుడి ఇండికేటర్లు తప్పనిసరిగా ఉండాలి. బ్రేకుల లోపం తెలిపే ఎరుపు ఇండికేటర్ ఉండాలి. ఫ్యూయల్ గేజ్, స్పీడో మీటర్, డ్రైవర్ సీట్ దగ్గర ఎయిర్ హ్యాండ్ బ్రేక్ ఉండాలి. వెనుక దారి కనిపించేలా అద్దం, బస్సులో కూర్చున్న విద్యార్థుల కదలికలు కనిపించేలా ఇంటర్నల్ అద్దం. విద్యార్థులు ఎక్కడం, దిగడం కనిపించేలా క్రాస్ వ్యూ అద్దాలు తప్పనిసరిగా అమర్చుకోవాలి. అత్యవసర సమయంలో తలుపు అద్దం పగలగొట్టేందుకు సుత్తి, తలుపులకు సురక్షితమైన లాకింగ్ వ్యవస్థ ఉండాలి. బస్సు డ్రైవర్ వయసు 60 ఏళ్లకు మించి ఉండొద్దు. అతడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలి. బస్సు సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించుకోకూడదు. ప్రతీ బస్సులో ప్రథమ చికిత్స కిట్టు తప్పనిసరిగా ఉండాలి.

**ప్రథమ చికిత్స డబ్బాలో కానరాని పరికరాలు..**

విద్యాసంస్థల బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ అందులో ప్రథమ చికిత్సకు సంబంధించి ఎలాంటి పరికరాలు ఉండటం లేదని తెలుస్తోంది. ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో తప్పనిసరిగా కాటన్, అయోడిన్, స్పిరిట్ బాటిల్, బ్యాండేజ్ ఉండాలనే నిబంధన ఉంది. బస్సుల్లో తదితర వస్తువులు ఉన్న ప్పటికీ అవి కాలంచెల్లి ఉండటం గమనార్హం. చిన్నచిన్న ప్రమాదాలు జరిగినప్పుడు విద్యార్థులకు ప్రథమ చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉపయోగపడతాయి. వీటితో పాటు విద్యార్థులు బ్యాగులు పెట్టుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి. డ్రైవరుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఫోటో పేరు, సెల్ నంబర్ విధిగా ప్రదర్శించాలనే నిబంధన ఉంది.

**ఊసేలేని డ్రైవర్ల మెడికల్ సర్టిఫికెట్లు..**

పాఠశాల బస్సుల్లో పనిచేసే డ్రైవర్లకు రెండు సంవత్సరాలకు ఒకసారి వైద్య చికిత్సలు చేయించి మెడికల్ సర్టిఫికెట్ అందుబాటులో ఉంచాలి. కాని ఈ విషయమై యాజమాన్యాలు దృష్టి సారించడంలేదని సమాచారం. డ్రైవర్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు యాజమాన్యాలు ధ్రువీకరించుకోవాల్సిన అవసరం ఉంటుంది. అలాగే హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి ఐదు సంవత్సరాల అనుభవం ఉన్న వారినే డ్రైవర్లుగా నియమించుకోవాలనే నిబంధన కూడా ఉంది. లైట్లు, హ్యాండ్ బ్రేక్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లు, పసుపుపచ్చ రంగు కలిగి ఉండాలి.




# ధీర వెల్నెస్ కార్యక్రమం అభినందనీయం

## కేజీబీవీలలో నిర్వహించిన ధీర వెల్నెస్ కార్యక్రమాలపై సమీక్షా సమావేశంలో నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, మే 28 (ప్రభాత సమాచారం)**

కేజీబీవీలలో ధర్మసేవ ట్రస్ట్ నిర్వహిస్తున్న ధీర వెల్నెస్ కార్యక్రమం అభినందనీయమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ధర్మసేవ ట్రస్ట్ జిల్లాలోని ఆరు కేజీబీవీలలో నిర్వహించిన ధీర వెల్నెస్ కార్యక్రమాల మీద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధర్మసేవ ట్రస్టు ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఫిబ్రవరి 25 నుంచి ఏప్రిల్ 1 వరకు జిల్లాలోని 6 కేజీబీవీ విద్యాసంస్థల్లో విద్యార్థుల నైపుణ్యాలు పెంచేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ వెల్నెస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు యోగ, నీతి కథలు , ఆటలు, ఆర్ట్ అండ్ డ్రాయింగ్ ఆన్ లైన్ పోర్టల్ ద్వారా బాలికల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడం జరిగింది అన్నారు. జూన్ 26 రోజున ఇంటర్నేషనల్ డే డ్రగ్ అబ్యూస్ డే సందర్భంగా జిల్లాలోని డిగ్రీ కళాశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలో, అన్ని ఉన్నత పాఠశాలలో ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్ద మొత్తంలో ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే నిర్మల్ జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక కార్యచరణ రూపొందించి, 'డ్రగ్ ఫ్రీ నిర్మల్' గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలోని కళా జాతర బృందాలు గ్రామాలలో మత్తుపదార్థాల నిర్మూలనపై, మాదకద్రవ్యాల ద్వారా కలిగే అనర్థాలపై విశేష అవగాహన కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ధర్మసేవ ట్రస్ట్ ఈ అందించిన పరిజ్ఞానం భవిష్యత్తులో విద్యార్థుల ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జి విద్యాశాఖ అధికారి ఎం. పరమేశ్వర్, సమన్వయకర్త లింబాద్రి, ధర్మసేవ మేనేజింగ్ ట్రస్టీ నిశాంత్ రెడ్డి, ధర్మసేవ ధీర ప్రోగ్రాం నిర్మల్ కోఆర్డినేటర్ ఎస్. స్రవంతి, డిసిఓ గీత, ఏసిఎంఓ శివాజీ, కేజీబీవీల ప్రత్యేక అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





# భూ సర్వేలో సర్వేయర్లు కీలకం

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, మే 28 (ప్రభాత సమాచారం)**

భూ సర్వేల నిర్వహణలో సర్వేయర్లది ముఖ్యమైన పాత్ర అని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. లైసెన్స్ సర్వేయర్లకు బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్లో సర్వే కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టాన్ని అమలు చేస్తుందని అన్నారు. ఈ చట్టాన్ని అనుసరించి భూ సమస్యలను సర్వేయర్లు పరిష్కరించాలన్నారు. శిక్షణ కాలంలో అధికారుల నుంచి అన్ని విషయాలను సమగ్రంగా తెలుసుకొని క్షేత్రస్థాయిలో భూ సర్వేలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కాగా జిల్లాలో 113 మంది లైసెన్స్ సర్వేయర్లకు 50 రోజులపాటు ఉదయం, సాయంత్రం రెండు పూటలా శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వేయర్ సుదర్శన్, లైసెన్స్‌సర్వేయర్లు, అధికారులు, పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి

# దరఖాస్తుల ఆహ్వానం

**మంచిర్యాల, మే 28 (ప్రభాత సమాచారం)**

స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాల ఎంపిక కొరకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా క్రీడా యువజన సేవల శాఖ అధికారి కీర్తి రాజీవీరు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర క్రీడా అకాడమీలో ప్రవేశం దరఖాస్తులు స్వీకరించడం కొరకు 1వ తేదీన సిద్ధిపేటలోని వాలీబాల్ అకాడమీలో, 10వ తేదీన రాజన్న సిరిసిల్లలోని వాలీబాల్ అకాడమీలో, 10, 11 తేదీలలో ఓ.యు. క్యాంపస్‌లోని సైక్లింగ్ వెల్మోని సైక్లింగ్, రెజ్లింగ్ అకాడమీలో, హన్మకొండలోని రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్లో, 12వ తేదీన వనపర్తిలోని హాకీ అకాడమీ, ఖమ్మంలోని అథ్లెటిక్స్ అకాడమీ, 12, 13 తేదీలలో మహబూబ్‌నగర్‌లోని వాలీబాల్ అకాడమీలో కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు తమ జనన ధృవీకరణ పత్రం, స్పోర్ట్స్ సంబంధించిన జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ధృవపత్రాల నకలు ప్రతులతో సంబంధిత అకాడమీలో రిపోర్ట్ చేయాలని తెలిపారు. ఇతర వివరాలకు 9963539234 నంబర్‌లో సంప్రదించాలని, అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మే 28 (ప్రభాత సమాచారం)**

వర్షాకాలం సమీపిస్తున్నందున భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో జిల్లాలోని చెరువులు పూర్తి స్థాయిలో నిండి పంటలకు, ప్రజలకు ఎలాంటి నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో నీటి పారుదల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో జిల్లాలో కురిసే భారీ వర్షాల కారణంగా జిల్లాలోని చెరువులు నిండి గండి పడే ప్రమాదం ఉన్నందున అధికారులు ఎప్పటికప్పుడు నీటి మట్టాన్ని పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. చెరువుల కారణంగా పంట నష్టం, రహదారులు తెగిపోవడం వంటి ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తత చర్యలు తీసుకోవాలని, చెరువులు 90 శాతం నిండిన యెడల సంబంధిత అధికారిక గ్రూప్ సమాచారం అందించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. నీటిపారుదల శాఖ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని నీల్వాయి ప్రాజెక్టు, కరకట్ట నిర్మాణ పనుల పురోగతి వివరాలు తెలుసుకొని అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలోని నీటి ప్రాజెక్టులలో నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎల్లంపల్లి ప్రాజెక్టులో సరిపడా నీటి మట్టం ఉందని, త్రాగునీటికి జిల్లాలో ఎలాంటి కొరత లేదని తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదల ఎస్ఈ. విష్ణుప్రసాద్, మంచిర్యాల, చెన్నూర్ డివిజన్ల డి.ఈ.ఈ.లు, ఎ.ఈ.ఈ.లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో కార్యదర్శులదే కీలకపాత్ర

**ఆసిఫాబాద్, మే 28 (ప్రభాత సమాచారం)**

గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో పంచాయతీ కార్యదర్శులదే కీలకపాత్ర అని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో స్వచ్ఛ భారత్ మిషన్ అగా ఖాన్ పౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఆసిఫాబాద్, తిర్యాణి మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, సెర్ప్ ఏపీఎం, ఉపాధి హామీ పథకం, ఏపీఎం, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన ఒక్కరోజు అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామ పంచాయతీలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర చాలా కీలకమన్నారు. ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు చేపట్టడం, తడి చెత్త, పొడి చెత్తలు సేకరించడం, మురికి నీరు నిలువ లేకుండా చర్యలు, రహదారుల శుభ్రత, ప్రతి ఇంటింటికి ఇంకుడు గుంతల నిర్మాణం, మురుగు కాలువల శుభ్రత, స్వచ్ఛమైన త్రాగునీటి సరఫరా, బహిరంగ మలమూత్ర విసర్జన లేకుండా ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంతో వినియోగించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించడం వంటి చర్యలతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా చేయవచ్చని, ఆదిశగా ప్రజలకు అవగాహన



కల్పించి చైతన్యవంతులను చేయాలని వెల్లడించారు. ఇందు కొరకు స్వచ్ఛభారత్ మిషన్ అగా ఖాన్ ఫౌండేషన్ సహకారంతో ముందుకు వెళ్లాలని, మంచినీరు వృధా కానివ్వకుండా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, సామాజిక గుంతల నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, ఎస్. ఐ. ఆర్. డి. రాష్ట్ర సమన్వయకర్త సుభాష్, యూనిసెఫ్ ప్రతినిధి మహాలక్ష్మి, రాష్ట్ర శిక్షకులు రమేష్, అగా ఖాన్ ఫౌండేషన్ ప్రతినిధులు నజీర్, సెల్వరాజ్, కిరణ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుడు ఎన్టీఆర్



**జన్నారం, మే 28 (ప్రభాత సమాచారం)**

తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహానీయుడు ఎన్టీఆర్ అని తెలుగుదేశం పార్టీ జన్నారం మండల అధ్యక్షుడు ఉప్పుల విజయ్ పార్లమెంటు నియోజకవర్గ నాయకులు పులి శెట్టి శ్రీనివాస్ అన్నారు. ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో కేక్‌ను కట్ చేశారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వృద్ధులకు పండ్లు పంచిపెట్టారు. పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఎన్టీఆర్ వివిధ పథకాలను ప్రవేశపెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, ప్రసాద్ పట్టణ అధ్యక్షులు ముత్యంపెల్లి నవీన్ ప్రధాన కార్యదర్శి హరీష్ స్వరాజ్ నాయక్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ఎంహెచ్‌డీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాంపల్లి రాజం

**బెల్లంపల్లి, మే 28 (ప్రభాత సమాచారం)**

పట్టణానికి చెందిన కాంపల్లి రాజంను మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు ఆయన నియామకాన్ని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు సునీల్ ప్రకటించారు. నియామక ఉత్తర్వులను రాజంకు అందజేశారు. మాజీ కౌన్సిలర్ రాజంను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించడం పట్ల పలువురు ఎంహెచ్‌డీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో రాష్ట్ర స్థాయి బాధ్యతలను అప్పగించినందుకు రాజం సునీల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.





# సిర్పూర్ లో వేడెక్కిన రాజకీయం

- నువ్వా, నేనా అంటూ సవాళ్ల పర్వం
- "ప్రాజెక్టు కట్టి నీళ్లు ఇవ్వగలవా?"..
- కోనప్ప, హరిష్ బాబుకు ఘాటు సవాల్
- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు గృహనిర్బంధం
- మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హౌస్ అరెస్ట్..
- కౌటాలలో భారీగా పోలీసుల మోహరింపు..!



**ఆసిఫాబాద్, మే 28 (ప్రభాత సమాచారం)**
తూర్పు నియోజకవర్గం సిర్పూర్ కాగజ్‌నగర్‌లో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కాయి. నియోజకవర్గ అభివృద్ధి తో పాటు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణంపై ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, కోనేరు కోనప్ప మధ్య పరస్పర సవాల్ చేసుకున్నారు. ప్రాణహిత నది ఒడ్డున కూర్చుని తెలుసుకుందామంటూ సవాల్ విసురుకున్నారు. ఇటు కోనప్ప, అటు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అనుచరులు, కార్యకర్తలు భారీగా తరలిరావడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో పోలీసులు ఇరువర్గాల ముఖ్య నాయకులతో పాటు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, కోనేరు కోనప్పను పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు. తూర్పు నియోజకవర్గం సిర్పూర్ కాగజ్‌నగర్‌లో రాజకీయ వేడి పెరుగుతోంది. నియోజకవర్గంలో గత 10 ఏళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు తుమ్మడి హెట్టి ప్రాజెక్టు నిర్మాణం అంశంపై బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యే పాల్వాయి హరిష్ బాబు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు సవాల్ విసిరారు. ఆయన నది ఒడ్డున కూర్చుని "తెలుసుకుందాం" అంటూ కోనప్పను పిలువడం గమనార్హం. ఈ క్రమంలో ఉదయం తుమ్మడి హెట్టి ప్రాంతానికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా కోనప్పను అనుచరులు మరియు కార్యకర్తలు ఇండ్ల వద్దకు తరలి రావడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు ఇరువర్గాల ప్రధాన నాయకులతో చర్చలు జరిపి ఎమ్మెల్యే పాల్వాయి హరిష్ బాబు, మాజీ మంత్రి కోనప్పలను గృహ నిర్బంధంలో ఉంచారు. అయినా ఎమ్మెల్యే పాల్వాయి హరిష్ బాబు పోలీసులను అడ్డుకొని తప్పించుకుని బయటకు వచ్చారు.

**పాల్వాయి హరిష్ బాబు...**
"కోనప్ప సిర్పూర్ నియోజకవర్గానికి పదేళ్ల పాలనలో చేసిన పనేమీ లేదు. తుమ్మడి హెట్టి ప్రాజెక్టును సీఎం కేసీఆర్ తాకట్టు పెట్టారు. ప్రాజెక్టును కాళేశ్వరం తరలించి తూర్పు ఆదిలాబాద్‌ను ఎడారిగా మార్చిన ఘనత కోనప్పదే. నియోజకవర్గ అభివృద్ధిపై అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే కూడా కోనప్పనే. అందుకే ప్రజలు ఆయన్ను ఓడించారు" అని హరిష్ బాబు అన్నారు. తుమ్మడి హెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్‌ను వెంటనే పూర్తి చేసి నిర్మాణాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

**కోనప్ప ప్రతిస్పందన..**
మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ "తుమ్మడి హెట్టి ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకున్నది నీ తల్లే. దానికి సంబంధించిన ఆధారాలు మీడియా వద్ద ఉన్నాయి. నీకు చేతనైతే తుమ్మడి హెట్టి నిర్మాణం పూర్తి చేసి నీళ్లు ఇచ్చి చూపించు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.
కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది ఒడ్డున ప్రాజెక్టు మోసాలపై చర్చకు రావాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మంగళవారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సవాల్‌ను స్వీకరించారు. బుధవారం ఉదయం కాగజ్‌నగర్‌లోని ఆయన ఇంటి నుంచి కౌటాల మండలం తుమ్మిడి వద్దకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ పోలీసులు భారీగా మోహరించి కోనప్పను హౌస్ అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తమ్ముడు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కోనేరు కృష్ణారావు నాయకులతో కలిసి కౌటాల నుంచి తుమ్మిడి హెట్టి వద్దకు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న సమయంలో కౌటాల సీఐ ముత్యం రమేశ్ అడ్డుకున్నారు. బీజేపీ నాయకులు ప్రాణహిత వద్దకు ఎలా వెళ్తారని కృష్ణారావు ప్రశ్నించగా.. ఎవరిని కూడా అక్కడికి వెళ్లనివ్వమని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని సీఐ కోనేరు కృష్ణారావుకు వివరించడంతో ఆయన వెనుతిరిగి కౌటాల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లారు. బీజేపీ మండల అధ్యక్షుడు కుంచాల విజయ్ పార్టీ కార్యకర్తలతో కలిసి తుమ్మిడి హెటి వద్ద గల ప్రాణహిత నది వద్ద కార్యకర్తలతో చేరుకొని ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తామంతా ఇక్కడికి చేరుకున్నామని తెలిపారు. పదేళ్ల పాలనలో మాజీ ఎమ్మెల్యే కోనప్ప ప్రాజెక్టు విషయంలో చేసింది ఏమి లేదని విమర్శించారు. బహిరంగ చర్చకు ఎమ్మెల్యే హరీశ్ బాబు సిద్ధంగా ఉన్నప్పటికీ పోలీసులు అడ్డుకోవడంతో ఇక్కడికి రాలేకపోయారన్నారు. ఆ తర్వాత అక్కడికి చేరుకున్న కోనప్ప కార్యకర్తలు ఎమ్మెల్యే హరీశ్ బాబు వ్యాఖ్యలపై తీవ్రంగా ఖండిస్తూ ప్రాణహిత నదిపై బహిరంగ చర్చకు మాజీ ఎమ్మెల్యే కోనప్ప రానవసరం లేదని తాము దేనికైనా సమాధానం ఇచ్చే అంత ధైర్యం మా దగ్గర ఉందని దమ్ముంటే ఎమ్మెల్యే హరీశ్ బాబు రావాలని సవాల్ విసిరారు. అనంతరం మండల కేంద్రంలోని కోనప్ప నివాసంలో సమావేశం ఏర్పాటు చేసి తాజా ఎమ్మెల్యే హరీశ్ బాబు ఏడాదిన్నర పాలనలో ఏ ఒక్క అభివృద్ధి పని చేయకపోగా నిత్యం ప్రజల కోసం సేవ చేసే, ప్రజల మధ్యలో ఉండే కోనేరు కోనప్ప అతని కుటుంబాన్ని విమర్శించే స్థాయి హరీష్ బాబుది కాదని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొమరం మాంతయ్య అన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మండల కేంద్రంలో ఇటు కోనప్ప మద్దతుదారులు, అటు బీజేపీ కార్యకర్తలు బయటకు రావడంతో ఇరు వర్గాలు ఎదురు పడకుండా కౌటాల సీఐ ముత్యం రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# వన్యప్రాణుల రక్షణకు సమష్టిగా కృషి చేయాలి

**అటవీ, రెవెన్యూ సరిహద్దు వివాదాలను పరిష్కరించుకోవాలి**
**అధికారుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**



**ఆసిఫాబాద్, మే 28 (ప్రభాత సమాచారం)**
వన్యప్రాణుల రక్షణకు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, ఎం.డేవిడ్, డీఎఫ్ నీరజ్ కుమార్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి అటవీ రక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని అడవిని, వన్యప్రాణుల సంరక్షణ మన అందరి బాధ్యత అన్నారు. జిల్లాలో 56 శాతం అడవి ఉందని, అటవీ ప్రాంతంలో ఆక్రమణ జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. అటవీ ప్రాంతంలో వేటగాళ్లు విద్యుత్ తీగలను అమర్చి వన్యప్రాణులను హతమారుస్తున్నారని, ఈ చర్య వల్ల అమాయకులైన వ్యవసాయ రైతులు, కూలీలు విద్యుత్ తీగలకు తగిలి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు.. అడవి గుండా వెళ్తున్న విద్యుత్ తీగలను రోడ్డు పక్కనుండి వెళ్లే లాగా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరా సౌర గిరి జల శక్తి పథకం ద్వారా గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు బోరు బావులు వేసి సౌర విద్యుత్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. అటవీ. రెవెన్యూ సరిహద్దు వివాదాలను ఇరు శాఖల అధికారుల సంయుక్త సర్వే నిర్వహించి హద్దులు గుర్తించేందుకు అన్ని చర్యలు తీసుకోవడంతో పాటు అటవీ భూమి ఆక్రమణకు గురి కాకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అంతకుముందు వనమహోత్సవపై సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 51 లక్షలు మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు. మొక్కలు నాటేందుకు శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసి. 100 శాతం మొక్క లను రక్షించేలా అధికారులు కృషి చేయాలని కోరారు.

## సాగు రైతుల భూముల జోలికొస్తే ఊరుకోం

**కన్నెపల్లి, మే 28 (ప్రభాత సమాచారం)**
పేద రైతుల సాగు చేసుకుంటున్నా భూములపై అటవీ అధికారులు కన్నేసి వారిపై అక్రమ కేసులు నమోదు చేసి, మానసికంగా వేధిస్తే, వారి భూముల జోలికొస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని బీజేపీ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు కొయ్యల ఏమాజి అన్నారు. ఆయన బుధవారం వేమనపల్లి మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన 9 మంది దళిత రైతులపై అటవీశాఖ అధికారులు అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపిన అటవీ అధికారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన బిజెపి నాయ కులతో కలిసి చామనపల్లి గ్రామంలో పర్యటించి రైతులతో కలిసి వారు సాగు చేసుకుంటున్నా భూములను పరిశీలిం చారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ గత యాభై సంవత్సరాల నుండి రైతులు చామనపల్లి శివారులోనీ సర్వే నెంబర్ 65, 67 లో సాగు చేస్తున్నారని అన్నారు. ఆ భూముల్లో విద్యుత్ మోటార్లు, స్తంభాలు, బోర్లు వేసుకొని వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం పట్టా పాసు పుస్తకాలు ఇచ్చిందని, లోన్లు, రుణ మాఫీ చేసిందని అన్నా రు. 1997 లోనే ఫైనల్ పట్టా ఇచ్చిందని తెలిపారు. గత సంవత్సరం నుండి అటవీశాఖ అధికారులు ఈ భూములు అటవీ శాఖ కు చెందినవని రైతులపై దాడులు చేస్తూ, అక్రమంగా కేసులు నమోదు చేసి రైతులను జైలుకు పంపించారని తెలిపారు. అటవీశాఖ అధికారుల పై ఎస్సీ ఎస్టీ అ ట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం రైతులు జిల్లా కలెక్టర్ ను కలిసి ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా వారి బాధలు తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి పోలీసు అధికారులకి ఫోన్ చేసి అటవీశాఖ అధికారుల పై కేసు నమోదు చేసి జైలుకు



పంపాలని ఆదేశించారని తెలిపారు. నిల్వాయి పోలీస్ స్టేషన్లో అటవీ అధికారులపై రైతులు ఫిర్యాదు చేశారని కానీ ఇప్పటికీ పోలీసులు అటవీశాఖ అధికారులపై కేసు నమోదు చేయలేదని ఇటీవల రాష్ట్ర మంత్రి సీతక్క ఇటీవల జిల్లాలో పర్యటించిన సందర్భంగా సాగురైతులు, పోడు రైతుల జోలికి పోవద్దని అటవీశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినా ఖాతరు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కేశవ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



## పురుగుల మందు తాగి ఆత్మహత్య

**బోథ్, మే 28 (ప్రభాత సమాచారం)**
మండలంలోని బాబెర గ్రామానికి చెందిన ఆత్రం దశరథ్ అనే వ్యక్తి బుధవారం ఉదయం పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఆత్రం దశరథ్ గత రెండు సంవత్సరాలుగా కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడు. అంతే కాకుండా రోజూ మద్యం కూడా తాగేవాడు. బుధవారం ఉదయం సమయంలో కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లగా ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు సేవించాడు. మధ్యాహ్నం ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి పడిపోయి ఉండడాన్ని గమనించిన కుటుంబీకులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో బోథ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మంచిర్యాలలో ఆగనున్న చెన్నై ఎక్స్‌ప్రెస్

**మంచిర్యాల, మే 28 (ప్రభాత సమాచారం)**
చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌కు మంచిర్యాల స్టేషన్‌లో స్టాప్ ప్రయాణికుల సౌకర్యార్థం ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ భగత్‌కీ కోటి ఎక్స్ప్రెస్ ఇక నుంచి వచ్చి వెళ్లేటప్పుడు మంచిర్యాల స్టేషన్‌లో ఒక నిమిషం పాటు ఆగనుంది. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి వచ్చే రైలు మే 28 నుంచి, తిరిగి వచ్చే రైలు మే 31 తేదీ నుంచి మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో ఆగుతుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం తెలిపారు.

# ట్రాక్ ప్యాంట్ లో నభా హాట్ ఫొటో షూట్



ఇస్మార్ట్ బ్యూటీ నభా మరోసారి తన గ్లామరస్ లుక్స్ తో అందరి దృష్టిని ఆకర్షించింది. స్టైలిష్ బ్రాలెట్‌కు స్పోర్ట్ ట్రౌజర్ ధరించి తన ఫిట్ ఫిజిక్ తో అందాల ఆరబోత చేసింది. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. తెలుగు ప్రేక్షకులను తన చలాకీతనం, గ్లామర్ మంత్రముగ్ధులను చేసిన నభా.. మరోసారి గ్లామరస్ ఫొటో షూట్ తో నెట్టింట హాట్ టాపిక్ గా మారింది. స్టన్నింగ్ ఫోజులతో నభా హాట్ అందాలు కుర్రాళ్లను మైమరిపిస్తున్నాయి. స్టైలిష్ బ్రాలెట్‌కు స్పోర్ట్ ట్రౌజర్ ధరించి తన ఫిట్ ఫిజిక్ తో అందాల ఆరబోత చేసింది. నాజూకు నడుమందాలతో చూపిస్తూ ఫొటోలకు ఫోజులిచ్చింది. ఈ ఫొటోలపై సోషల్ మీడియాలో లైకులు వర్షం కురిపిస్తున్నారు నెటిజన్లు. నభా ప్రస్తుతం 'స్వయంభూ' సినిమాలో ఫీమేల్ లీడ్ గా నటిస్తోంది. సినిమాల్లో ఎక్కువగా కనిపించకపోయినా.. సోషల్ మీడియాలో తరచూ గ్లామరస్ ఫొటోలతో నెటిజన్లను ఆకట్టుకుంటుంది. తెలుగులో మొదటి సినిమా ఇస్మార్ట్ శంకర్ తో ఫుల్ క్రేజ్ దక్కించుకుంది ఈ ముద్దుగుమ్మ.






## హరిహర వీరమల్లు నుంచి నిధి అందాల సాంగ్..

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం 'హరిహర వీరమల్లు' క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఈ చిత్రం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతోంది. పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ అదిరిపోయే అప్డేట్ అందించారు. 'తార తార' అంటూ సాగే సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ పాటలో నిధి అగర్వాల్ తన అంద చందాలతో ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ సాంగ్ అదరగొడుతోంది. ఇదిలా ఉంటే ఈ మూవీ ప్రారంభమై రెండు మూడేళ్లు గడుస్తుంది. కానీ ఇప్పటి వరకు రిలీజ్ కాలేదు. పవన్ కల్యాణ్ రాజకీయాలలో బిజీ బిజీగా ఉండటంతో ఈ చిత్రం వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పటికే చాలా డేట్లు అనౌన్స్ చేశారు. కానీ ఆ డేట్లు వాయిదా వేశారు. చివరికి జూన్ 12న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కానున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఇక ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన సాంగ్స్, గ్లింప్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మరో సాంగ్‌ను రిలీజ్ చేసి మరింత బజ్ క్రియేట్ చేశారు. ఇందులో నిధి అందాలు ఆరబోసి అబ్బురపరచింది. మరి ఎన్నో రోజుల నుంచి ఎదురుచూస్తున్న ఈ చిత్రం ఎలాంటి రెస్పాన్స్ అందుకుంటుందో చూడాలి.

## సుప్రీం కోర్టుకు మంచు విష్ణు!



టాలీవుడ్ హీరో మంచు విష్ణు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. 2019 ఎన్నికల సమయంలో తనపై నమోదైన ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన కేసు కొట్టివేయాలని సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఈమేరకు దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం జస్టిస్ బీ.వీ. నాగరత్న నేతృత్వంలో ప్రతివాదనలకు నోటీసులు జారీ చేసింది. అలాగే తదుపరి విచారణను జులై 15 కి వాయిదా వేస్తున్నట్లు నిర్ణయించారు. అయితే 2019లో ఎన్నికల నియమాలను ఉల్లంఘించారని ఆరోపణలతో మంచు విష్ణుపై కేసు నమోదైంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం మంచు విష్ణు ఫుల్ టెన్షన్ లో ఉన్నారు. ఆయన హీరోగా నటించిన 'కన్నప్ప' మూవీ హార్డ్ డ్రైవ్ ని దొంగతనం జరిగింది. ఇందులో మూవీలోని vfx, గ్రాఫిక్స్ కి సంబంధించిన కీలక సన్నివేశాలు ఉండడంతో నిర్మాతలు, హీరో ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై ఇప్పటికే నిర్మాతలు ఫిలిం నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేస్తున్నారు. ఓవైపు కన్నప్ప సినిమా ప్రమోషన్స్‌తో తీరిక లేకుండా గడుపుతున్న మంచు విష్ణుకు ఇదొక కొత్త తలనొప్పిగా మారింది. దీంతో మంచు విష్ణు ఆవేదన వ్యక్తం చేస్తూ ఎక్స్‌లో ఓ ఎమోషనల్ పోస్ట్ షేర్ చేశారు. ఆ పరమ శివుడిని ప్రశ్నిస్తూ.. 'జటాజూటధారీ, నీకోసం తపస్సు చేసే నాకెందుకు ఈ పరీక్ష స్వామీ?'.. హరహర మహాదేవ్' అంటూ భావోద్వేగానికి గురయ్యారు.



## గూస్‌బంప్స్ తెప్పిస్తున్న 'మిరాయ్' టీజర్..

'హనుమాన్' హీరో తేజ సజ్జ నటిస్తున్న కొత్త సినిమా 'మిరాయ్'. ఇందులో టాలీవుడ్ హీరో మంచు మనోజ్ విలన్ రోల్ పోషిస్తున్నాడు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా టీజర్ రిలీజ్ అయింది. టీజర్‌లో హీరో ఎలివేషన్స్ ఓ రేంజ్‌లో ఉన్నాయి. ముఖ్యంగా వీఎఫ్ఎక్స్ అద్భుతంగా, చాలా క్లీన్ అండ్ నీట్‌గా ఉన్నాయి. టీజర్ మొదట్లో మంచు మనోజ్ మాస్ యాక్షన్ అదిరిపోయింది. పవర్ ఫుల్ విలన్‌గా మనోజ్ కనిపించబోతున్నట్లు అర్థం అవుతోంది. అలాగే హీరో తేజ సజ్జను చూపించే విధానం బాగుంది. అతడు చేసే యాక్షన్ సన్నివేశాలు వేరే లెవెల్ అని చెప్పాలి. స్టన్నింగ్ విజువల్ ఎఫెక్ట్స్‌తో అచ్చం హాలీవుడ్ సినిమాను తలపించింది. ముఖ్యంగా సాహస సన్నివేశాల్లో తేజసజ్జ ఎక్కడా కాంప్రమైజ్ కానట్లు కనిపించింది. ఎలాంటి సన్నివేశాన్ని అయినా అతడు చాలా శ్రమపెట్టి చేసినట్లు అర్థం అవుతోంది. ఈ టీజర్ బట్టి చూస్తే 'మిరాయ్' ఇండియన్ బాక్సాఫీసు వద్ద కలెక్షన్ల వర్షం కురిపించబోతున్నట్లు తెలుస్తోంది. ఇక టీజర్ చివర్లో రాముని రాకను చూపించిన విజువల్స్ హైక్లాస్‌గా ఉన్నాయనే చెప్పాలి. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించినట్లు టీజర్ చూస్తే అర్థం అవుతుంది. ఈ చిత్రాన్ని టిజి విశ్వప్రశాద్, క్రితి ప్రసాద్ కలిసి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇక అన్ని పనులు పూర్తి చేసుకుని ఈ చిత్రం ఈ ఏడాది సెప్టెంబర్ 5న 7 భాషల్లో రిలీజ్ కానుంది.

# అధిక దిగుబడికి నాణ్యమైన యాజమాన్య పద్ధతులు పాటించాలి



**మందమర్రి, మే 28 (ప్రభాత సమాచారం)**

రైతులు అధిక దిగుబడి కోసం మంచి నాణ్యమైన యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి జి కిరణ్మయి తెలిపారు. బుధవారం ఆమె మండలంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్తి విత్తన ప్యాకెట్లను, స్టార్ట్ రిజిస్టర్ను, రశీదు పుస్తకాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... పత్తి విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. యాజమాన్య పద్ధతులలో నేల స్వభావం, నీటి వసతి, ఎరువుల వాడకం, చీడల నివారణ ముఖ్యమైనవని తెలిపారు. హైబ్రిడ్ విత్తనాలన్ని ఒకే తరహాలో దిగుబడులు ఇస్తాయని, వర్షాధార రైతులు మద్యస్థ కాయలు వచ్చే హైబ్రిడ్ విత్తనాలు వాడాలని, నీటి వసతి ఉన్న నల్ల భూముల్లో పెద్ద కాయలు వచ్చే హైబ్రిడ్ విత్తనాలు వాడాలని సూచించారు. ఒకే రకపు విత్తనాల కోసం రైతులు పోటీ పడవద్దన్నారు. విత్తనాల కొనుగోలు ముందు రైతులు తప్పనిసరిగా కొన్ని అంశాలు తెలుసుకోవాలని తెలిపారు. విత్తనాల ప్యాకెట్ పై తయారు తేది, గడువు తేదీ, జీఈఏసి నెంబర్ ఉందా లేదా చూసుకోవాలని తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలు కొని, మోసపోవద్దని ఆ విత్తనాలకు ప్రభుత్వ అనుమతి లేదని తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలు హైబ్రిడ్ పత్తి విత్తనాలను కలుషితం చేస్తాయన్నారు. తక్కువ ధరకు, ఎక్కువ ధరకు విత్తనాలు అమ్మేవారి వివరాలు, పక్క జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన నకిలీ పత్తి విత్తనాల వివరాలు అధికారులకు తెలపాలని సూచించారు. అధికృత డీలర్ నుండి కాకుండా మిత్రుల దగ్గర విత్తనాలు కొనుగోలు చేయవద్దని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే మండల వ్యవసాయ అధికారిని గాని వ్యవసాయ విస్తరణ అధికారులను గాని సంప్రదించాలని సూచించారు.



## గంజాయి మొక్కల స్వాధీనం

**బోథ్, మే 28 (ప్రభాత సమాచారం)**

సోనాల మండలం లోని పార్డీ (కే)గ్రామంలోని పలువురి ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్నారన్న సమాచారంతో బుధవారం సిఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌లు తనిఖీలు నిర్వహించి గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోలంకి గులాబ్ సింగ్ ఇంటి ఆవరణలో ఐదు మొక్కలు స్వాధీనం చేసుకున్నామని అంతేగాక రామ్ సింగ్ చౌహాన్ ఇంటి ఆవరణలో మరో మూడు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని, గంజాయి మొక్కలు పెంచిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి సేవించిన, విక్రయించిన, గంజాయి పండించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

**సిరికొండ, మే 28 (ప్రభాత సమాచారం)**

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి చెందిన సంఘటన సిరికొండ మండలంలో చోటుచేసుకుంది. భాదితులు తెలిపిన వివరాల ప్రకారం మండల లోని కొండాపూర్ గ్రామానికి చెందిన రైతు బొబ్బిలి ఎర్రన్న చెందిన ఆవు వ్యవసాయ పొలంలో బుధవారం గడ్డి మేయాడానికి వెళ్లి ప్రమాదవశాత్తు పొలంలోని కిందపడి ఉన్న విద్యుత్ వైర్లు ఆవు కు విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు బాదితులు తెలిపారు మరణించిన ఆవు విలువ సుమారు 80 వేల రూపాయల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు ప్రభుత్వ తగిన నష్టపరిహారం అందించి అందుకోవాలని కోరుతున్నారు.

## గొంతులో చికెన్ ముక్క ఇరుక్కుని ఒకరు మృతి

**దిలావర్‌పూర్, మే 28 (ప్రభాత సమాచారం)**



నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం కాల్వ తండాలో బుధవారం విషాదం చోటు చేసుకుంది. తండాకు చెందిన అంగోత్ కనిరాం(40) అనే వ్యక్తి పెండ్లి విందులో చికెన్‌తిని ముక్క గొంతులో తట్టుకోవడంతో అస్వస్థకు గురై మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సిర్గాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన పెళ్లి వేడుకల్లో పాల్గొన్న కనిరాం భోజనం చేసిన వెంటనే గొంతులో ఏదో రకమైన నొప్పి రావడంతో అస్వస్థకు గురై కుప్పకూలిపోయారు. వెంటనే ఆయనను నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కానీ రామ్ భార్య ఇద్దరు కుమారులున్నారు.

## అవకాశాలను అందిపుచ్చుకోవాలి

**ఉట్నూర్, మే 28 (ప్రభాత సమాచారం)**

స్వయం ఉపాధి కల్పనకై అందించే ట్రైనింగ్ లను సద్వినియోగం చేసుకొని వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా సూచించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగ యువకులకు అందించిన హెవీ వెహికిల్ డ్రైవింగ్ ట్రైనింగ్ పూర్తి కావడంతో బుదవారం స్థానిక ఐటీడీఏ పీఓ ఛాంబర్‌లో ట్రైనింగ్ నేర్చుకున్న వారికి సర్టిఫికేట్లను పీఓ ఖుష్బూ గుప్తా అందజేశారు. ఈ సందర్భంగా పీఓ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ఐటీడీఏ, టీజీఎస్ఆర్టీసీ ఆదిలాబాద్ డిపో సంయుక్త ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగ యువకులకు నెల రోజుల పాటు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కోసం ట్రైనింగ్ చేపట్టామన్నారు.

## అపద సమయంలో రక్తం అవసరం ఏడీఎంహెచ్ మనోహర్

**ఉట్నూర్, మే 28 (ప్రభాత సమాచారం)**

అపద సమయంలో రక్తం దొరకకా ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయని, అలాంటి పరిస్థితుల్లో రక్తం అందుబాటులో ఉంటే ప్రాణాలు కాపాడిన వారిమి అవుతారని ఏడీఎంహెచ్ ఓ డా. మనోహర్ అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా ఆస్పత్రిలో పరివర్తన్ ఫౌండేషన్ అద్వర్యంలో మెగా రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. జిల్లా ఆస్పత్రిలో నిత్యం ఏదో విషయంలో రక్తం అవసరం పడుతూనే ఉంటుందన్నారు. రక్తహీనతతో బాధపడు తున్న వారికి కచ్చితంగా రక్తం కావాల్సిందేనన్నారు. ఈ సమయంలో పరివర్తన్ ఫౌండేషన్ అద్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని, పౌండేషన్ పౌండర్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ జాదవ్ ఉపేందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డా.ఉపేందర్ జాదవ్ మాట్లడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో సికెల్ సెల్, రక్త హీనతతో బాధపడుతున్న వారికి ఇలాంటి రక్త దాన శిబిరాలతో పాటుగా అనేక సేవ కార్యక్రమాల్లో భాగస్వాములుగా యువత తో ఉంటూ ముందుకు వెళ్తామన్నారు. అనంతరం రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్లు డా కపిల్ నాయక్, డా.దీపక్ పుష్కర్, డా. సాయి ప్రశాంత్ రెడ్డి, డా.రవి రాథోడ్, డా.విక్రమ్, డా.మహేందర్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్, డా.సతీష్, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.



## వాగులో యువకుడు గల్లంతు?

**జైనథ్, మే 28 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. జైనథ్ మండలం తర్నం వంతెన పొంగి ప్రవహించగా ప్రమాదవశాత్తు ఓ యువకుడు గల్లంతయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. జైనథ్ మండలం లక్ష్మీపూర్‌కు చెందిన లాండిగే దత్తు (30) ఆదిలాబాద్ నుంచి మోటార్ సైకిల్‌పై తన ఇంటికి వెళ్తుండగా మధ్యలో వంతెన దాటే ప్రయత్నం చేసి అందులో పడిపోయాడు. ఉదయం దత్తు ఇంటికి రాకపోవడంతో బంధువులు వంతెన వద్ద గాలించడంతో ఆయన మోటార్ సైకిల్ లభించింది. వంతెన పరిసర ప్రాంతాల్లో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## గురుకుల ప్రిన్సిపాల్‌ను అభినందించిన సీఎం



**జైపూర్, మే 28 (ప్రభాత సమాచారం)**

జైపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులం ప్రిన్సిపాల్ కోలా నాగేశ్వర్‌రావును సీఎం రేవంత్ రెడ్డి అభినందించి గురుకుల అభివృద్ధికి చెక్కు అందజేశారు. గురుకులం 2024 -25 విద్యాసంవత్సరం పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో రాష్ట్ర స్థాయిలో అభినందనలు లభించాయి. హైదరాబాద్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గురుకులం సొసైటీ సెక్రెటరీ అలుగు వర్షిణి, కాలేశ్వరం జోనల్ ఆఫీసర్ అరుణకుమారి పాల్గొన్నారు.

## గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి

**జన్నారం, మే 28 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇందనపల్లి పంచాయతీ కార్యదర్శి ఎర్రోజుల చంద్రమౌళి(58) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడు ఇంట్లో కుర్చీలో కూర్చుని గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. గత రెండు సంవత్సరాలుగా ఇందనపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న చంద్రమౌళి గ్రామ ప్రజలతో, అధికారులతో కలివిడిగా ఉండేవారు. మృతుడు జగిత్యాల జిల్లా వాసి. మృతునికి భార్య పద్మతో పాటు కుమారుడు ఉదయ్, కుమార్తె మేఘన ఉన్నారు. చంద్రమౌళిమృతిచెందడంతో ఆయన భార్య, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుని కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేస్తూ అన్ని విధాలుగా ఆదుకుంటామని పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లాకావత్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. మృతదేహాన్ని ఎంపీడీవో హుమార్ షరీఫ్, ఎంపీఓ జలంధర్, పలువురు పంచాయతీ కార్యదర్శులు పరామర్శించారు.



## ఢిల్లీ జాతీయ సదస్సుకు డాక్టర్ శ్రీధర్




**ఆదిలాబాద్, మే 28 (ప్రభాత సమాచారం)**

న్యూ ఢిల్లీలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ స్టేక్ హోల్డర్ కన్సల్టేషన్ సదస్సులో ఆదిలాబాద్ జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీధర్ బుధవారం పాల్గొన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో జరుగుతున్న ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్రం నుంచి హాజరయ్యారు. దేశంలో వాతావరణ అనుకూలత కోసం ఆవిష్కరణలు, పరస్పర అధ్యయనాన్ని బలోపేతం చేయడం అనే అంశాలపై సదస్సు నిర్వహిస్తున్నారు. దేశ వ్యాప్తంగా ప్రముఖులు, విధాన నిర్ణేతలు, వైద్య, ఆరోగ్యరంగ నిపుణులు హాజరయ్యారు. శ్రీధర్‌తో పాటు నల్గొండ జిల్లా నుంచి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి డాక్టర్ మధు వరన్ కూడా పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు.

## జిల్లా స్థాయి సబ్ జూనియర్ హాకీ జట్టు ఎంపిక పోటీలు

**ఆదిలాబాద్, మే 28 (ప్రభాత సమాచారం)**

క్రీడాకారులు విజయమే లక్ష్యంగా పోటీ పడాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని మేజర్ ధ్యాన్ చంద్ హాకీ ఫీల్డ్ బుధవారం ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్ హాకీ జట్టు ఎంపిక పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోనే జూన్ 8 నుంచి 11 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ టోర్నమెంట్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, హాకీ శిక్షకులు జాదవ్ రవి, శేఖర్, గోకుల్, తదితరులు పాల్గొన్నారు.





## సీనియర్ సిటీజన్లకు సన్మానం

**ఆదిలాబాద్, మే 28 (ప్రభాత సమాచారం)**

జిల్లా వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో 90సంవత్సరాలకుపై బడ్డ సీనియర్ సిటీజన్లను సన్మానించారు. మాజీ మంత్రి రామచంద్రారెడ్డి నివాసంలో చిలకూరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ దేవిదాస్ దేశ్ పాండే, కార్యదర్శి రాంకులకర్ణి, పోషట్టి, జి. సత్యనారాయణ, పి. శంకర్ తో పాటు కాంగ్రెస్ నాయకులు అంబటి అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవిదాస్ దేశ్ పాండే మాట్లాడుతు వయోవృద్ధులు ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే దినసరి ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, చిన్న చిన్న యోగ చిట్కాలు, నడక చాలా అవసరమన్నారు

## ఆసిఫాబాద్ తహసీల్దార్ రియాజ్ అలీ

**ఆసిఫాబాద్, మే 28 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ తహసీల్దార్‌గా రియాజ్ అలీ బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రోహిత్ బదిలీపై మంచిర్యాల జిల్లాకు వెళ్లగా ఆయన స్థానంలో వాంకిడి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రియాజ్ అలీని కలెక్టర్ ఆసిఫాబాద్ తహసీల్దార్ నియమించారు.

## సాగు భూములపై అధికారులు జులుం మానుకోవాలి

**ఖానాపూర్, మే 28 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడి జిల్లాలో అటవీ శాఖ అధికారులు పేద ప్రజల సాగు భూములపై చేస్తున్న మానుకోవాలని, సాగు భూముల్లో కందకాలు తవ్వడాన్ని నిలిపివేయాలని సీపీఐ ఎం, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంత నాయకులు డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్ వద్ద బుధవారం సాగు భూముల వద్ద అటవీ అధికారులకు, లబ్ధిదా రులకు మధ్య గొడవ చోటుచేసుకుంది. సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన కుమార్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్యలు మాట్లాడుతూ గత కొద్దిరోజుల నుండి ఫారెస్ట్ అధి కారులు ఖానాపూర్, కడం, పెంబి, ఉడుంపూర్ రేంజి లా ప రిధిలోని అల్లంపల్లి, ఇటిక్యాల తర్లపాడు తదితర చోట్ల పేద రైతులను ఇబ్బందులకు గురి చేస్తు ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యనికి పలుపడుతున్నారు అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని, సాగులో ఉన్న గిరిజను లకు, ఇతరులకు పట్టాలి ఇవ్వాలని ప్రభుత్వని డిమాండ్ చే స్తున్నట్లు పేర్కొన్నారు. తర్లపాడు శివారులో ఫారెస్ట్ అధికారులు ఇద్దరు రైతుల భూముల్లో జెసిబిల ద్వారా గుంతలు కందకాలు తవ్వడం చేశారని, ఫారెస్ట్ అధికారుల చర్యను వారి దౌర్జన్యాన్ని ఆపాలని రైతులతో, ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేస్తూ జెసిబిల ముందు బైఠాయింపు చేశారు. ఫారెస్ట్ అధికారులు ఇప్పటికైనా సాగు భూముల్లో కందకాలు తీ యడం గుంతలు తవ్వడం ఆపకపోతే నాలుగు రేంజల పరిధిలో ని ప్రజలతో కలిసి డి.ఎఫ్.ఓ కార్యాలయం ముట్టడిస్తామని వారు తెలిపారు. ప్రజలు ఎక్కడికక్కడ అడ్డుకోవాలని ఈ కార్యక్ర మంలో రైతు కుటుంబాలతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దాకూర్ తిరుపతి, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంభు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి డి పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి



**ఆసిఫాబాద్, మే 28 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అధికారులు సమన్వయంతో కృషి చేసి ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం.డేవిడ్, డీఎఫ్ఓ నీరజ్ కుమార్, కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఎ.ఎస్.పి. చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్ రావులతో కలిసి ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2వ తేదీన నిర్వహించే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కలెక్టరేట్ భవనాన్ని విద్యుత్ దీప కాంతులతో సుందరీకరించాలని, చిల్డ్రన్ పార్క్‌లోనిఅమరవీరుల స్థూపాన్ని ముస్తాబు చేయాలని, వేదికను పూలతో అలంకరించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారిని ఆదేశించారు. వేడుకల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు, పారిశుద్ధ్యం, ప్రముఖులు, ప్రెస్ గ్యాలరీ ఏర్పాటు పనులను సమర్ధవంతంగా నిర్వహించాలని తెలిపారు. వేడుకలకు హాజరయ్యే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని, జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలను వేడుకలకు ఒక రోజు ముందే విద్యుత్ కాంతులతో ముస్తాబు చేయాలని తెలిపారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని, వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. అధికారులతో కలిసి కలెక్టరేట్ ఆవరణలో వేడుకల నిర్వహణ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యం కొనాలని రైతుల రాస్తారోకో



**ముథోల్, మే 28 (ప్రభాత సమాచారం)**

బైంసా మండలంలోని కత్తిగాంలో వర్షాల కారణంగా తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతూ బుధవారం బైంసా పట్టణంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. నిర్మల్ భైంసా జాతీయ రహదా రిపై ప్రభుత్వ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానికంగా అధికారులు వరి ధాన్యం తూకం వేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని వెంటనే తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు వచ్చి హామీ ఇచ్చేంత వరకు ఆందోళన విరమించమని భీష్మించుకుని కూర్చుకున్నారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని ఉన్నతాధికారులతో మాట్లాడించి ఈ ఆందోళన విరమింప జేశారు.

## ఎన్టీఆర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి

**ఉట్నూర్, మే 28 (ప్రభాత సమాచారం)**

ఎన్టీఆర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పలువురు నాయకులు లింగా గౌడ్, రాజేశ్వర్, రమేష్ అన్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి. వేడుకలు బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలో ఎన్టీజర్ చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద పార్టీలకతీతంగా నాయ కులు పాల్గొని ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గతంలో అధికారం లో ఉన్నప్పుడు, పేద బడుగు వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అభివృద్ధి చేసిన ఘనత ఎన్టీఆర్ దే నన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో జారన్ రవి, సురేష్, పాల్గొన్నారు.





## భూ భారతి దరఖాస్తులపై కలెక్టర్ ఆరా

**ఆదిలాబాద్, మే 28 (ప్రభాత సమాచారం)**

భూ భారతి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన భోరజ్ మండలాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా సందర్శించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలో భూ భారతి పథకం కింద వచ్చిన దరఖాస్తుల పై ఆరా తీశారు. మొత్తం 1067 దరఖాస్తులు రాగా వాటిని కలెక్టర్ పరిశీలించారు. 142 దరఖాస్తులు తిరస్కరిం చినట్లు, ఇందులో 494 దరఖాస్తులు అమోదించినట్లు తెలిపా రు. 249 దరఖస్తులకు నోటిసు జరీ చెయ్య డం జరిగిందన్నారు. ఈ దరఖాస్తులను క్షు ణ్ణంగా పరిశీలించడం జరిగిందనీ, సంబంధిత దరఖాస్తుదారులకు సమాచారం తెలియజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, తహసీల్దార్లు రాజేశ్వరీ, నలంద ప్రియ పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

**మామడ, మే 28 (ప్రభాత సమాచారం)**

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి రాజనర్సయ్య అన్నారు. బుధ వారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సీజనల్ వ్యాధుల పట్ల పంచాయతీ కార్య దర్శులు, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని వాటర్ ట్యాంకులను ఎప్పటిక ప్పుడు శుభ్రం చేస్తూ, బ్లీచింగ్ పౌడర్‌తో క్లోరినేషన్ చేయాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశు భ్రంగా ఉండే విధంగా ప్రజలు చూసుకోవాలని లేనియెడల దోమలు వ్యాప్తి చెంది వివిధ రకాలైన వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సుశీల్ రెడ్డి, వైద్యాధికారి శ్రీకాంత్, వ్యవసాయ అధికారి సంధ్య, ఇరిగేషన్ ఏఈ విట్టల్, ఆర్‌డబ్ల్యుఎస్ఏఈ క్రాంతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉద్దేశ్యపూర్వకంగానే కేసు పెట్టారు



**ఆదిలాబాద్, మే 28 (ప్రభాత సమాచారం)**

తాను ఎవరికీ నకిలీ పట్టాలు ఇవ్వలేదని, ఫోర్జరీ సంతకాలు చేయలేదని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరి గంగాధర్ అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బి.నారాయణ గౌడ్ అనే వ్యక్తి తనపై కేసు పెట్టించారని ఆరోపించారు. 1996లో నాలుగో తరగతి ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇవ్వడం జరిగిందని, తహసీల్దారే పట్టాలు జారీ చేశారన్నారు. ఆశమ్మ అనే మహిళ ప్రభుత్వ ఉద్యోగి కాదని, డెయిలీవైజ్ ఉద్యోగి అని, ప్రభుత్వానికి డబ్బులు కట్టలేదని పేర్కొన్నారు. ఆమెకు అప్పటి తహసీల్దార్ పట్టా ఇవ్వలేదన్నారు. సుమిత్ర అనే ఉద్యోగి తమ సంఘంలో గతంలో కోశాధికారిగా పనిచేశారని, ఆమె ఇంటి స్థలాన్ని విక్రయించారని, ఆ స్థలంపై బ్యాంక్ రుణం సైతం తీసుకున్నారన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తనను రాష్ట్ర అధ్యక్షుడిగా చేస్తానని రూ.50 లక్షలు డిమాండ్ చేశారని, ఇవ్వకపోవడంతోనే తనపై ఇలా కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు.

# బక్రీద్ పండుగకు ఏర్పాట్లు చేయాలి

## వివిధ శాఖల అధికారుల సమీక్షా సమావేశంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





**నిర్మల్, మే 28 (ప్రభాత సమాచారం)**

బక్రీద్ పండుగను శాంతియుతంగా, సమగ్రంగా నిర్వహిం చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కల క్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధ వారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన బక్రీద్ పీస్ కమిటీ సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాబోయే జూన్ నెలలో జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూ చించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని ఈద్గా ప్రదేశాల్లో పిచ్చి మొక్కలను తొలగించి, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేప ట్టాలని చెప్పారు. ప్రార్థనలకు వచ్చే ముస్లిం సోదరులకు టెం టులు, షామియానాలు, త్రాగునీరు వంటి మౌలిక సదుపా యాలు కల్పించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఈద్గా ప్రదేశాల్లో విద్యుత్ సరఫరా పరిస్థితిని పర్యవేక్షించి, అవ సరమైన చోట మరమ్మతులు చేపట్టి సరఫరా పునరుద్ధరించా లన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎటువంటి అవాం ఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమా ల్లో తప్పుడు వార్తలు, పుకార్లు వ్యాపించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చ్చరించారు. అన్ని మతప రమైన వేడుకలను అన్నదమ్ములమయిన భావంతో శాంతి యుతంగా జరుపుకోవాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, బక్రీద్ పండుగ సం దర్భంగా పోలీసు శాఖ తరపున జిల్లాలో పటిష్ట భద్రతా చర్య లు చేపడతామని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పోలీస్ బలగాలు అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు తీసు కుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, పీస్ కమిటీ సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్ పేరుతో.. బూటకపు ఎన్‌కౌంటర్లు

## ప్రజాఉద్యమాల పోరాటసమితి అధ్యక్షురాలు విమ లక్క



**చెన్నూర్, మే 28 (ప్రభాత సమాచారం)**

ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం దుర్మార్గమైన చర్యఅని అరుణోదయ కళాకారిణి, ప్రజాఉద్యమాల పోరాటసమితి అధ్యక్షు రాలు విమలక్క పేర్కొన్నారు. బుధవారం చెన్నూరు పట్టణం లోని పద్మశాలి భవన్‌లో ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి పోచమల్లు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకు డు కాంతయ్య ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకం గా నిర్వహించిన నిరసన కార్యక్రమ సభ లో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం నక్సలై ట్లను బూట కపు ఎన్‌కౌంటర్లు చేయడం సరైంది కాదన్నారు. నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలని పేర్కొన్నారు. నక్సలైట్ల పేరుతో అమా యక ఆది వాసీ గిరిజనులపై మారణహోమం సాగించడం ఆపాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కులను, 1/70చట్టాన్ని కాపాడాలని కోరారు. అడవి సంపదను, ఖనిజాలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నంలో భాగంగా సల్వాజుడుం, ఆపరేషన్ కగార్ పేరుతో ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం సిగ్గుచేటని తెలి పారు. మావోలు తాము చర్చలకు సిద్ధమని చెబుతు న్నా.. పట్టించుకోకుండా కాల్పులు జరపడం శోచనీయ మన్నారు. ఎన్‌కౌంటర్లు చేస్తూ చనిపోయిన వారి మృత దేహాలను కూడా బంధువులకు అప్పగించకపోడం దుర్మార్గమన్నారు. ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశా రు. అనం తరం ర్యాలీగావెళ్లి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ రాష్ట్ర నాయకులు ప్రసాద్, నాగిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం, ఐఎఫ్‌టీయూ రాష్ట్రకార్యదర్శి భాస్కర్, విశ్వనాథ్, సత్యం, ఆదివాసీ నాయకులు కుమార్, సాధు, మల్లన్న, అంజయ్య, చంద్రశేఖర్, జైపాల్ సింగ్, బోడంకి చందు, చంద్రశేఖర్, పౌలు, సమ్మయ్య, వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.



# బాసర ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ విడుదల

**ముథోల్, మే 28 (ప్రభాత సమాచారం)**

బాసర ఆర్జీయూకేటీలో ప్రవేశాల కోసం 2025-26 విద్యా సంవత్సరా నికి నోటిఫికేషన్‌ను బుధవారం వైస్ చాన్సలర్ గోవర్ధన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ.. బాసర సెంటర్‌లో 1500ల సీట్లు, మహబూబ్‌నగర్ సెంటర్‌లో 180 సీట్లకు ఆరేండ్ల సమీకృత విద్యా విధానంలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించడానికి అడ్మిషన్ నోటిఫి కేషన్‌ను విడుదల చేశామన్నారు. ఈ విశ్వవిద్యాలయం సాంకేతిక విద్యను అందించడమే లక్ష్యంగా ఏర్పటయిందని, ఇంజినీరింగ్ విద్యను అందిస్తు న్నామని తెలిపారు. దీంతో ఉపాధి, ఉద్యోగావకాశాలు పేద విద్యార్థులు పొంతున్నారన్నారు. నోటిఫికేషన్ పూర్తి వివరాలను ట్రిపుల్ ఐటీ వెబ్‌సై ట్‌లో ఉంచామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్, కో-కన్వీనర్ డాక్టర్ దేవరాజ్, అసోసియేట్ డీన్ డాక్టర్ విఠల్, మంతపురి హరికృష్ణ పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్యాలయానికి భూమి విరాళం

**సారంగాపూర్, మే 28 (ప్రభాత సమాచారం)**

మండలంలోని అడెల్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి గ్రామానికి చెందిన తాంద్ర రాజేశ్వర్(డీలర్) లక్ష్మవ్వలు తన భూమిని బుధవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీవో అజీజ్ ఖాన్, గ్రామ నాయకులు, గ్రామస్తులు వారిని ఘనంగా సత్కరించారు. ఎంపీఓ అజీజ్ ఖాన్ మాట్లాడుతూ... గ్రామ అభివృద్ధికి తన భూమిని విరాళంగా అందిం చడం అభినందనీయమని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిటి రవీందర్ సెక్రటరీ రజిత ఆలయ చైర్మన్ సింగం భోజ గౌడ్ విడిసి అధ్యక్షు డు శేఖర్ గౌడ్ దండు సాయన్న రాము లక్ష్మీనారాయణ గౌడ్ లక్ష్మణ్ రాము, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY



# భూములు లాక్కొని పొట్ట కొట్టొద్దు

## అధికారులను వేడుకున్న రైతులు

**చింతలమానేపల్లి, మే 28 (ప్రభాత సమాచారం)**

ఏళ్లుగా భూములను నమ్ముకొని బతుకుతున్నామని వాటిని లాక్కొని మా పొట్ట కొట్టవద్దని పోడు రైతులు అటవీశాఖ అధికారులను వేడుకున్నారు. బుధవారం చింతలమానేపల్లి మం డలం దిందా బండపల్లి శివారులో ఎఫ్డిఓ సుశాంత్ సిబ్బందితో కలిసి పోడు భూముల హద్దులు తవ్వడానికి జెసిబి తో రావడంతో రైతులు అడ్డుకున్నారు. దీంతో ఎఫ్డిఓ రైతులతో చర్చించారు. 40, 50 ఎకరాల ఫారెస్ట్ భూమి ఉన్న రైతులు భూమిని ప్లాంటేషన్‌కు వదిలి పెట్టాలని కోరారు. 9 ఎకరాలలోపు ఉన్న భూముల ను తీసుకోమని తెలిపారు. అయిన ప్పటికీ రైతులు ఒప్పుకోకుండా జెసిబి ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 40 ఏండ్లుగా సాగుచేసుకుంటున్నాం.. మాప్రాణాలైనా ఇస్తాం కానీ భూముల ను మాత్రం వదులుకోమని స్పష్టం చేశారు. హద్దులు పెట్టేందుకు వచ్చిన ఫారెస్ట్ అధికా రులలోఎఫ్ఆర్వో ఇక్బాల్,ఎఫ్ ఎస్ఓలు సూర్యనారాయణ, మోహన్, ఎఫ్బిఓ పాల్గొన్నారు.